# జగన్మాత

"రుక్మిణిని చూద్దామే మనం వెళ్ళి" అన్నది మా ధనలక్ష్మి. రుక్మిణిని చూడడం అంటే చాలా పరువు నష్టం. అసహ్యామైన పని అని నాకు ముందే మనస్సులో భావం వుంది. అందుకని నేను ముఖం చిట్లించాను. ఆ పేరు నోరారా ధనలక్ష్మి పలకడం కూడా నాకు బాగా లేదు. 'రుక్మిణా, దానికి బతకడానికి సిగ్గు లేకపోతే, మనకి చూడ్డానికి బిడియం వుండాలిగా' అని మనసులో అనుకుని...

"ధనలక్ష్మీ! నువ్వు కావాలంటే వెళ్ళి చూడు. కానీ నేను రాను" అన్నాను క్లుప్తంగా.

"అది కాదే! దాని గుండె పాపం అగ్ని పర్వతమై పోయివుంటుంది. మనబోటి స్నేహితులు వెడితే, కాస్త చల్లారుతుంది. ఎవ్వరూ పలకరించకపోతే అది చచ్చిపోదటే?" అన్నది ధనలక్ష్మి.

"నీకంత జాలిగా వుంటే నువ్వెళ్ళు. పాపంట, పాపం! ఏడు తరాలకు సరిపడినంత పాపం అదే స్వయంగా చేసుకుని కూచుంది. నేను దాని ముఖం చూడను లక్ష్మీ! చూడ్డమంటూ వస్తే తుపాకీతో కాల్చడానికే  అంతే!" అన్నాను చాలా ఖచ్చితంగా.

మేము చెప్పుకుంటున్న రుక్మిణికి ఒక గాథ ఉంది. దానికి ముప్ఫై దాటినా పెళ్ళి కాలేదు. చేసే దిక్కు లేదు. తినడానికి దాని పెంపుడు మేనత్త యిచ్చినది ఉంది. అలా వంటరిగా పెళ్ళి కాకుండా బతుకుతుంటే, ఎవరితోటో సంబంధం కలిగి, ఒక కొడుకు పుట్టాడు. పెళ్ళి కాకుండానే తల్లి అయిన రుక్మిణి నా దృష్టిలో పతిత, పాపి.

చిన్ననాటి నుంచి నేను, రుక్మిణి, ధనలక్ష్మి ఒకే వీథిలో వుంటూ, కలిసి పెరిగాము. ఎన్నో ఆటలు ఆడుకున్నాం. ఒక బండిలో ఎక్కి బడికి వెళ్ళాము. ఒకే కాలేజీలో చేరి, పక్క పక్కన కూచుని గ్రాడ్యుయేట్సుమయ్యాం. అంత ప్రాణ స్నేహితురాలు యింత పాడు పని చేసిందంటే నాకు కడుపులో మంట లేచింది.

"అది కుమిలి కుమిలి ఏడుస్తూ, పుట్టిన నలుసుని చూడకుండా కూచోనుంటుంది.నేను వెళ్ళి ఓదార్చి, ధైర్యం చెబుతాను. ఆ పిల్లవాడిని ఏం చేయాలో సలహా యిద్దాం. ఆ పాటి మనమైనా చేయకపోతే అది ఏమైపోతుంది? అందరు కాకుల్లా పొడుస్తారు. మనమూ పొడిస్తే, మన స్నేహానికి విలువ ఏముంది?" అంటూ ధనలక్ష్మి మరొక రౌండు వాదన ఆరంభించింది.

నా ఉద్దేశ్యంలో రుక్మిణిని ముఖం వాచేటట్లు చీవాట్లు పెట్టి, ఎడాపెడా వాయించి, ఆ పిల్లవాడిని ఏ దిక్కు లేని శరణాలయంలోనో పడేయించాలి. వాడు అసలు పుట్టనే లేదని చెప్పి, దాని పాపానికి

ప్రాయశ్చిత్తంగా, ఏ ఆశ్రమానికో పంపేయాలి' ఈ సంగతి స్పష్టంగా చెప్పాను ధనలక్ష్మికి. "పోనీ, అలా చీవాట్లు పెట్టడానికైనా వెళ్ళాలిగా? పద. ఆ పని నువ్వే చేద్దువు గాని. అది ఏడుస్తొంటే, నేను ఓదారుస్తాను" అన్నదామె.

అసలు శీలం కోల్పోయిన తర్వాత ఆడదాని జన్మకు విలువే లేదు. ఏదో ఒక బలహీన క్షణంలో ఎవరికైనా లొంగినా ఆ పాప ఫలాన్ని మోసి, కనడమా?ఆ సంగతి నలుగురికీ తెలిసిపోయినా, యింకా ప్రాణాలతో వుండడమా! ఛీ! ఇల్లా ఆలోచిస్తున్న నాలో ఒక అసహ్యం, వికారంగా కడుపులో తిప్పేసింది.

ధనలక్ష్మి నిట్టూర్చింది. జాలిగా నా కళ్ళలోకి చూసింది. "చూడు, మనం చిన్నప్పుడు ఆడుకునే రోజుల్లో దానికి వాళ్ళ బామ్మ యిచ్చిన ప్రసాదం మొత్తం నీకే పెట్టేది. జ్ఞాపకముందా? నీకు స్కూల్లో ప్రైజు రావడం కోసం తను పాటల పోటీల్లోకి రాకుండ వుండేది. గుర్తుందా? కాలేజీలో అందాల పోటీలో నువ్వు నెగ్గాలని తను వెనక్కి వుండిపోయేది. మరచిపోయావా?" అంటూ ధనలక్ష్మి మొదలు పెట్టిన యీ పాత కథలన్నీ వింటుంటే, యీ సోది వినేకంటే రుక్మిణి యింటికి ఒక విజిటు నయమనిపించింది.

"ఊ సరే వస్తాను. కానీ ఒక షరతు. అక్కడ పది నిముషాలు మాత్రం వుంటాను. ఏడిచి మొత్తుకున్నా నేను కరగను. దులిపి వేస్తాను. నువ్వు అతిగా ఓదారుస్తూ ముద్దు చేశావంటే నేను ఊరుకోను. సరేనా? అల్లాగైతే వస్తాను" అన్నాను. ధనలక్ష్మి వప్పుకుంది.

సరే బయలు దేరాం. కుతూహలం అది ఎలా వుందోనని, ఆ కులటని చూసి మనం చేతులు కాస్త కడుక్కుని ప్రక్షాళనం చేసుకోవాలే అని బాధ.

ఇల్లు కొంచెం వెతికినా త్వరగానే చేరి రిక్షా దిగాం. తలుపు వేసి వుంది. నేను రిక్షాకు డబ్బిస్తోంటే ధనలక్ష్మి తలుపు కొట్టింది. రుక్మిణి తలుపు తీసింది.

"హాయ్! రండి, రండి ఏమిటల్లా నిలబడిపోయావే రా" అంటూ నా చేయి పట్టుకుని లోపలికి గుంజినంత పని చేసింది. మేము లోపలికి వెళ్ళగానే తలుపు గడియ పెట్టేసింది.

"లోపలే గదిలో కూర్చుందాం రండి. నా కొడుకు నిద్రలేచే టైమయింది. లేచాడంటే యిల్లు ఎగరకొట్టేస్తాడు." అంటూ మా యిద్దరి చేతులూ వదలకుండా పుచ్చుకుని లోపలకు తీసుకెళ్ళింది. ఉయ్యాల చుట్టూ దోమతెర, లోపల పడుకున్న రెండు నెలల పసి వాడు. వాణ్ణి చేతుల్లోకి తీసుకుని "ఆ మంచం మీద కూర్చోండర్రా. ఎవరికివ్వను మీలో? అసలు యింత పసి వాడిని ఎత్తుకోవడం ఎవరికి బాగా ప్రాక్టీసు మీ యిద్దరిలో?" అన్నది నవ్వుతో. దాని కళ్ళ నిండా కాటుక. చెంపలు పలుచగా తాంబూల రాగ రంజితాలైన పెదవులకి అందమిస్తూ మెరుస్తున్నాయి. కాళ్ళకి చెప్పులు, బాలింతతనం, యింకా జివజివలాడుతూ పచ్చిగా వంటిని చుట్టుకున్నట్టు కనిపించింది.

ధనలక్ష్మి కాస్త తేరుకున్నట్టు ముఖం పెట్టి "ఉండు, కాస్త చేతులు కడుక్కుని వస్తాం" అంటూ లోపలికి నడిచి, నువ్వు రా అన్నట్టు నా వంక చూసింది. నేను వెంట వెళ్ళి శుభ్రంగా కాస్త చేతులు కడుక్కుని వచ్చాను.

మంచం మీద కూర్చున్న ధనలక్ష్మి వళ్ళో ఆ బాబుని పెట్టబోయి, "ఒసే! నువ్వు ధనం కంటే పెద్ద దానివి. వాడిని ముందుగా నువ్వే ముద్దు పెట్టుకుని ఆశీర్వదించవే" అన్నది.

అంతే నా వళ్ళో మెత్తగా, మృదువుగా బుల్లి చేతుల అబ్బాయి.

"మాట, పలుకు లేకుండా అల్లా వున్నారేమిటి? వీడు నా కొడుకు. ఎవరనుకుంటున్నారు? ఇంక వేరే లోకం లేదు నాకు. వేరే లోకమే లేనప్పుడు యింక ఆ లోకంలో వాళ్ళేమనుకుంటున్నారో నాకేం పడుతుంది? అంతా నా పోలికే కదూ? ముక్కు చూడు" అన్నది రుక్మిణి వెలిగిపోతున్న కంఠంతో. నా చేతులు ఆ పిల్లవాడిని గట్టిగా పడిపోకుండా పట్టుకున్నాయి.

"నాకు ఎప్పుడూ నా అనేవారు లేరని నాకు పిచ్చెక్కి పోతుందని అనుకున్నాడు భగవంతుడు. పాపం అందుకే నాకీ వరం ప్రసాదించాడు. మంచి పేరు దొరకడం లేదమ్మా వీడికి. మా అమ్మ, నాన్న, అన్నయ్య వదిలేసినా మీరొచ్చారు నన్ను చూడడానికి. ప్రాణ స్నేహితులంటే మీరే!" అన్నది మళ్ళీ ... నేను గుటక మింగాను జవాబు లేక.

నా వళ్ళో బాబు బరువుగా తన మృదుత్వాన్నంతా నా మీద వేసి నన్ను నొక్కేస్తున్నట్లుగా, ధనలక్ష్మి మాత్రం పిచ్చినవ్వు ఒకటి ముఖానికి తగిలించుకుని మార్చి మార్చి పిల్లవాడినీ, రుక్మిణినీ చూస్తోంది.

"కూర్చోండే! ధనమ్మా కాఫీ యిస్తాను. వాడు లేచేలోగా అన్ని పనులూ పూర్తి చేసుకుంటాను.లేచాడంటే నాకు యింక ఏదీ చూడాలనిపించలేదు. వాడి ముఖంలోకే చూస్తూ కూచుంటాను" అంటూ గబగబా కాఫీ ప్రయత్నం చేయడం మొదలెట్టింది. ధనలక్ష్మి వాడిని తనవళ్ళోకి తీసుకుంది. మా యిద్దరి మధ్య మాటలు కావు కదా. చూపులు కూడా లేవు.

మేము కాఫీలు తాగుతుంటే రుక్మిణి పిల్లవాడిని తీసుకుంది. వాడిని పొదివి పట్టుకొని దగ్గరగా హత్తుకున్నప్పుడు ఆమె వేపు చూశాను. అరమూతలు పడుతున్న కళ్ళల్లో స్వర్గ శాంతి చిన్న నవ్వుగా విచ్చిన పెదవిలో గర్వరేఖ. వేలి కొనల నుంచీ అనురాగం జాలు వారి వాడి అణువణువూ తడిమి పునీతమౌతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్న చేతులు.

కాఫీ తాగి, "వస్తాం రుక్మిణీ! ఆరోగ్యం జాగ్రత్త" అంటూ బయటికి వస్తోంటే...

"మరోసారి రండే. అల్లా వచ్చి, యిల్లా వెళ్ళిపోతున్నారు. ఏమిటో... వీడి నాన్నకి గుండె ధైర్యంలేక, యింత వరకు వచ్చి చూడనే లేదు. తప్పించుకుని తిరుగుతున్నాడు. అంత భయపెట్టాడు నా బాబు అంతటి మగవాడినీ!" అన్నది గలగల నవ్వేస్తూ.

మేము రిక్షాకి కేక వేయకుండా నడుస్తోంటే "ఏమే! కాలుస్తానన్నావు, పొడిచేస్తానన్నావు. తిట్టిపోస్తానన్నావు. అల్లా మరి రాయిలా కూలబడ్డావేం" అన్నది ధనలక్ష్మి.

నేను ఒక్క క్షణం వూరుకుని, "నాసంగతి సరే గానీ, ఓదారుస్తానన్నావు, ధైర్యం చెబుతానన్నావు. నువ్వా అవాక్కయి పోయావేం?" అన్నాను ఎదురు ప్రశ్నగా. రిక్షా ఎక్కాలన్న ధ్యాస లేకుండా గబగబా నడుస్తున్నాం.

"అది ఏడవనిదే నేనేం ఓదారుస్తాను?" అన్నది ధనలక్ష్మి. ఒక గొప్ప సత్యాన్నీ, తేజస్సునీ ఆ యింట్లో వదిలేసి వస్తున్నట్టు అప్పటికే అనిపించసాగింది.

"అదెందుకు ఏడుస్తుందీ? హిమాలయ పర్వత శిఖరం మీద కూర్చుని, మనబోటి వాళ్ళందర్నీ చిన్న చూపు చూస్తున్న జగన్మాత అది. ఎందుకేడుస్తుంది?" అన్నాను.